

ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామంలో నీళ్లు లేక బీటలు వారిన పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

# 'అన్నపూర్ణ'ను ఎడారిగా మార్చొద్దు

- వారంలోగా ప్రాజెక్టుకు జలకళ తీసుకురండి
- పంటపొలాలు ఎండిపోకుండా చూడండి
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- గ్రామాల్లో పంటపొలాల పరిశీలన

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 2: కేసీఆర్ పాలనలో నిర్మించిన అన్నపూర్ణ ప్రాజెక్టును ఎడారిగా మార్చొద్దని, శ్రీ రాజరాజేశ్వర జలాశయం నీటిని వారం లోగా విడుదల చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. విద్యుత్, సాగునీటి కొరతతో రైతుల పంటపొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారం లోగా అన్నపూర్ణ ప్రాజెక్టుకు జలకళ తీసుకురావాలని, లేకుంటే అన్నదాతలతో కలిసి ఆందోళ న చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం ఆయన అనంతగిరి, తిప్పాపూర్, పెద్దలింగాపూర్, సిరికొండ గ్రామాల శివారులో ఎండిన వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించి, మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కఠోరశ్రమతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారన్నారు. పదేండ్లుగా అన్నపూర్ణ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు పచ్చని పంట పొలాలతో కళకళలాడాయని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్‌హయాంలో శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి దిగువకు నీటిని తీసుకెళ్తున్నారని, పక్కనే ఉన్న అన్నపూర్ణ ప్రాజెక్టును మాత్రం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ప్రాజెక్టు నిర్మాణానికి అనంతగిరి గ్రామస్తులు సర్వం కోల్పోయారని, నేడు వారికే సాగునీటి ఇబ్బందులు కలిగించడం సరికాదన్నారు. ఆయన వెంట జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, ఎంపీటీసీ పరశురాం, ఉప సర్పంచ్ బాలకిషన్, నాయకులు ముత్తారెడ్డి, రమణారెడ్డి, అనిల్, బొప్ప శ్రీనివాస్, బాబు, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు గుర్తింపు

- వేములవాడ ఏరియా దవాఖానకు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్
- హర్షం వ్యక్తం చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ, ఫిబ్రవరి 2: రోగులకు అత్యుత్తమ వైద్య సేవలందిస్తున్న వేములవాడ ఏరియా దవాఖానకు కేంద్ర ప్రభుత్వం గుర్తింపునిచ్చింది. దవాఖానల్లోని అన్ని విభాగాల్లో మెరుగైన సేవల నిర్వహణకు గానూ కేంద్రం శుక్రవారం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్) సర్టిఫికెట్ ప్రకటించింది. కార్పొరేట్‌కు దీటుగా అత్యాధునిక పరికరాలు, మౌలిక సదుపాయాలు, వసతులతో రోగులకు నాణ్యమైన సేవలందిస్తుండగా, కేంద్ర బృందం గతేడాది అక్టోబర్‌లో వేములవాడ ఏరియా దవాఖానను సందర్శించింది. ఫార్మసీ, ఓపీడీ, అడ్మిన్, రేడియాలజీ, ఎమర్జెన్సీ, ఆక్సిలరీ సర్వీసెస్, ఐపీడీ, ఓటీ, ల్యాబ్, మెటర్నిటీ వార్డుల్లో అందిస్తున్న సేవలకు గానూ ఎన్‌క్వాస్ సర్టిఫికేషన్, లేబర్ రూమ్ మెరుగైన నిర్వహణకు గానూ లక్ష్య ప్రోగ్రామ్‌లో భాగంగా సర్టిఫికేషన్‌న, అలాగే పీడీయాట్రిక్ విభాగంలో ఉత్తమ వైద్య సేవలకు గానూ ముస్కాన్ సర్టిఫికేషన్‌ను వేములవాడ ఏరియా దవాఖాన కైవసం చేసుకున్నది. ఎన్‌క్వాస్ గుర్తింపు రావడంపై కలెక్టర్ అనురాగ్ జయంతి హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో దవాఖానలో వైద్య ప్రమాణాలు మెరుగయ్యాయని చెప్పడానికి ఈ సరిఫ్టికెట్ నిదర్శనమన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రజలకు నాణ్యమైన, అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు. అందుకు కృషి చేసిన సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు, వైద్యులు అనిల్‌కుమార్, సంతోష్‌చారి,తిరుపతికి అభినందనలు తెలిపారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే

- అన్నివర్గాల అభివృద్ధి కోసం పనిచేసేది బీఆర్‌ఎస్సే
- ఉద్యమంలో బంజారాల పాత్ర కీలకం
- తండాలను జీపీలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే
- అబద్ధపు పునాదుల మీద కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కింది
- హామీలు అమలు చేసేదాకా ప్రజల పక్షాన పోరాడుతాం
- బండి సంజయ్ ఐదేళ్లలో ఐదు కొత్తల పనులు చేయలే
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- చింతకుంటలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ఎస్టీ సెల్ నాయకులతో ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, తదితరులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 2 : కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానేనని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఆచరణకు సాధ్యం కాని, అబద్ధపు హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు అమలయ్యేదాకా ప్రజల పక్షాన ఉద్యమిస్తామని తేల్చిచెప్పారు. చింతకుంటలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ఎస్టీ సెల్ నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. నాడు రాష్ట్ర సాధన ఉద్యమంలో బంజారాలు ముందున్నారని ప్రశంసించారు. రాబోయే ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పోడు భూములకు పట్టాలిచ్చిన ఘనత, అలాగే తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్ సర్కారుకే దక్కిందని కొనియాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను బొంద పెడతాం అని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతున్నారని.. వీళ్లిద్దరి గురువులైన చంద్రబాబు, వైఎస్‌ఆర్‌తోనే ఏమీకాలేదని, వారి శిష్యులైన వీరితో ఏమవుతుందని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌కు ఒక సిద్ధాంతం ఉందని, అని వర్గాల అభివృద్ధి కోసం ఆరాటపడే పార్టీ అని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. 2014లో బీఆర్‌ఎస్ సర్కారు కొలువుదీరే వరకు రాష్ట్రంలో కేవలం 7778 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యేదని, కేసీఆర్ సీఎం అయ్యాక పదేళ్లలో 26వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకున్నదని, దీనివల్ల రాష్ట్రంలో నిమిషం పాటు కరెంట్ పోకుండా సరఫరా చేయవచ్చన్నారు. గోదావరి, కృష్ణా నదులపై కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులు నిర్మించడంతో కోటి ఎకరాలకు సాగునీరందించి దేశానికి అన్నం పెట్టే స్థాయికి రాష్ట్రం చేరిందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో 1,60,083 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని, వారికి రెండు నెలలుగా వేతనాలు వేశారో లేదో చెప్పాలని సీఎంను డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు పరీక్ష నిర్వహిస్తే ఎన్నికల కోడ్‌లో నియామక పత్రాలు ఇవ్వడంలో ఆలస్యమైందని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి సర్కారు నియామక పత్రాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. కోదండరాం చెప్పినట్లుగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాల వివరాలపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని, డిసెంబర్ 24 వరకు వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ మత రాజకీయాలు చేస్తున్నదని, ఎన్నికలప్పుడే ఏదో ఒక కుట్రలకు తెరలేపి ఓట్లు దండుకొనే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లలో కనీసం ఐదు కొత్తల అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. కనీసం పార్లమెంట్ పరిధిలోని గ్రామాల్లో కూడా తిరగలేదని, ఇప్పుడు వెళ్లి ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతాడని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ రూప్‌సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కరీంనగర్ జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, బీఆర్‌ఎస్ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు జీవీ రామకృష్ణరావు, తోట ఆగయ్య, పౌరసఫరాల శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, ఎంపీటీసీ భూక్యా తిరుపతినాయక్, గుగులోత్ రవి నాయక్, గుగులోత్ తిరుపతి నాయక్, రాజునాయక్, బీలునాయక్, లక్ష్మీ వీరునాయక్, మంగ, మానస, రాంచందర్ నాయక్, కళావతి సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు

# ఎమర్జెన్సీ విధించిన చరిత్ర కాంగ్రెస్‌ది

- అప్పటి పోరాటయోధులను సమర యోధులుగా గుర్తించేందుకు కృషి చేస్తా
- త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనా రెడ్డిని సన్మానిస్తున్న ఎసీఎస్ రాజు, ముదుగంటి రవీందర్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 2 : దేశంలో ఎమర్జెన్సీ విధించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని, ఆ నాడు పత్రికలు, మీడియా సంస్థలపై ఉక్కు పాదం మోపి ప్రజాస్వామ్య గొంతు నులిమారని త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి గుర్తు చేశారు. ఆ సమయంలో ఇబ్బందిపడ్డ వారిని స్వాతంత్ర్య యోధులుగా గుర్తించి అన్ని రాయితీలు కల్పించేలా తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. భారత సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో జగిత్యాలలోని దేవిశ్రీ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన పౌరసన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కొన్ని రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ పోరాట వీరులను స్వాతంత్ర సమరయోధులుగా గుర్తింపునిచ్చారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు జరిగిన ఘర్షణల్లో తాను కత్తిపోట్లకు గురయ్యానని, జగిత్యాల ప్రాంతానికి చెందిన రామన్న, గోపన్న, జితేందర్ రెడ్డి, మధుసూదన్‌గౌడ్, తదితరులు తీవ్రవాదుల అరాచకాలను ఎదిరించి వారి చేతుల్లో వీరమరణం పొందారని గుర్తు చేశారు. ఎంతో మంది కార్యకర్తల త్యాగాలు, బలిదానాల వల్లే ఈ రోజు దేశంలో జాతీయవాదం బలపడిందని తెలిపారు. తనకు పౌర సన్మానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య, భారత సురక్ష సమితి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సత్య ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, వైద్యులు


# మెడికల్ హబ్‌గా తెలంగాణ

- వైద్యులు మానవతా దృక్పథంతో సేవలందించాలి
- బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- 9వ తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ సదస్సుకు హాజరు



నృత్యం చేస్తున్న విద్యార్థిని

కరంనగర్ విద్యానగర్, ఫిబ్రవరి 2 : తెలంగాణ రాష్ట్రం మెడికల్ హబ్‌గా మారబోతున్నదని, అందుకు ప్రభుత్వం పూర్తిగా సహకారం అందిస్తుందని బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి 9వ తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ సదస్సుకు రెండో రోజు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రజలు తెలంగాణకు వచ్చి వైద్యం చేసుకునే విధంగా వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజలు వైద్యుడిని దేవుడితో సమానంగా చూస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా మన్ననలు పొందాలని సూచించారు. సాంకేతికంగా దినాదినాభివృద్ధి చెందుతున్న రోబోటిక్, లేజర్, ల్యాప్రోస్కోపిక్, మైక్రో సర్జరీలతో ఒక్కరోజులోనే రోగి పూర్తిగా కోలుకుని నడిచే వైద్యం అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో 1400 మంది ఆర్థోపెడిక్ వైద్యులు ఉన్నారని, గ్రామీణ ప్రాంతాల్లో సైతం వైద్య సేవలందించాలని కోరారు. 50 కిలోమీటర్లకో ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తున్నామన్నారు. గతంలో ఆరోగ్యశ్రీలో ఉన్న ₹5 లక్షల పరిమితిని ₹10 లక్షలకు పెంచామన్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, వైద్య వృత్తి పవిత్రమైందని, నమ్మకంతో వస్తున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ దవాఖానల్లో మోకాలు కీళ్ల మార్పిడి లాంటి అధునాతనమైన శస్త్ర చికిత్సలు అందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ మాట్లాడుతూ, గతంతో పోలిస్తే వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, అధునాతనమైన వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాన్ఫరెన్స్ అధ్యక్షుడు మోతీలాల్, కార్యదర్శి డాక్టర్ బంగారి స్వామి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, వంశీ, వీరారెడ్డి, శ్రీనివాస్, రమాకాంత్, నర్సింహులు, రజినీప్రియదర్శిని, విజయలక్ష్మి పాల్గొన్నారు.



రాష్ట్ర సదస్సుకు హాజరైన వైద్యులు

## తొలి మొక్కు కోసం రాజన్న సన్నిధికి



ఆలయంలో భక్తులు

వేములవాడ టౌన్, జనవరి 2: సమ్మక్క-సారలమ్మ దర్శనానికి వెళ్లే భక్తులు తొలి మొక్కు చెల్లించేందుకు వేములవాడ రాజన్న సన్నిధికి తరలివస్తున్నారు. సమ్మక్క జాతర సమీపిస్తుండడంతో రోజురోజుకూ పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఎటు చూసినా రద్దీ కనిపించగా.. భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసి, క్యూలైన్ల గుండా స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కోడె మొక్కును చెల్లించుకున్నారు. సుమారు 45 వేల మంది రాయేశుడిని దర్శించుకున్నారని, సుమారు ₹26 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.


## ఆరు గ్యారెంటీలు కాదు.. 420 హామీలు
# అమలు చేయాల్సిందే

- మార్చి 17లోగా చేయకుంటే ఉద్యమించుడే
- రాష్ట్రంలో గందరగోళంగా కాంగ్రెస్ పాలన
- దిక్కుతోచని స్థితిలోనే రేవంత్‌రెడ్డికి అధికారం
- తెలంగాణ అసెంబ్లీ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి పక్కన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, నాయకులు

మంథని, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు తెలంగాణ ప్రజలకిచ్చింది ఆరు గ్యారెంటీలు కాదు, 420 హామీలని తెలంగాణ అసెంబ్లీ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి గుర్తు చేశారు. ఈ వాగ్దానాలను మార్చి 17లోగా అమలు చేయాల్సిందేనని, లేదంటే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని తేల్చిచెప్పారు. పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ నేతృత్వంలో మంథని పట్టణంలోని ఎస్ఎల్‌బీ గార్డెన్స్‌లో శుక్రవారం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌తో కలిసి ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ అనుకోలేదని, అందుకే ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చిందని ఎద్దేవా చేశారు. తీరా అధికారంలోకి రావడంతో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేక గందరగోళంగా పాలన చేస్తున్నదని విమర్శించారు. సరైన నాయకులు లేక పూటకో పార్టీ మార్చే రేవంత్‌రెడ్డికి సీఎం పదవి అప్పగించిందన్నారు. కాంగ్రెస్ రాకతో కరెంట్ కోతలు మొదలయ్యాయని చెప్పారు. రైతుబంధు రాక, సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు లాంటి రాజకీయ ఉద్దండులను ఎదురించి కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారన్నారు. వచ్చిన తెలంగాణను పదేండ్లలో అన్నింటా ముందుంచారని ప్రశంసించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు తగరం శంకర్‌లాల్, ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం సుమలత, కర్రు నాగయ్య, ఎక్కటి ఆనంతరెడ్డి, జక్కు రాకేశ్, ఆరెపల్లి కుమార్, ఆకుల కిరణ్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

### ప్రజలు ఆలోచించాలి

కాంగ్రెస్ ఆచరణ సాధ్యంకాని హామీలను నమ్మి ప్రజలు మోసపోయిన్రు. ఆ పార్టీ పాలనలో ఎండకాలం రాక ముందే కరెంట్ కోతలు మొదలైనయి. రైతుబంధు రాలేదు. నీరందక పొలాలు బీళ్లుగా మారుతున్నయి. ఫిబ్రవరి 1న గ్రూప్-1 నోటిఫికేషన్ ఇస్తామని చెప్పి చేతులెత్తేసింది. పోరాడి సాధించుకున్న తెలంగాణను తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిండు. ప్రజలు ఆలోచించాలి. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి.

- కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి

### కాంగ్రెస్ విశ్వాసం కోల్పోయింది

రేవంత్‌రెడ్డి, కేసీఆర్ పాలనలో తేడాను ప్రజలు గమనిస్తున్నరు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ప్రజల విశ్వాసం కోల్పోయింది. వారిచ్చిన గ్యారెంటీలన్నీ ఉత్తవేనని తేలిపోయింది. వాళ్లు అధికారంలో ఉండేది ఐదేండ్లే. ఆ తర్వాత ఆ పార్టీ దిగిపోవడం ఖాయం. కేసీఆర్ పాలనలోనే గడపగడపకూ సంక్షేమ పథకాలు చేరినయి. ప్రతి పల్లెకు అభివృద్ధి ఫలాలు అందినయి. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన చేపట్టిన స్కీంలను వివరించి ఓట్లు అభ్యర్థించాలె. బీఆర్‌ఎస్ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలె.

- కోరుకంటి చందర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు (పెద్దపల్లి)

### దమ్ముంటే అక్రమాస్తులను బయటపెట్టాలి

అసెంబ్లీ ఎన్నికల ముందు నేను అక్రమంగా ఆస్తులు కూడబెట్టానని, వందల ఇసుక లారీలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించిన్రు. ఇప్పుడు వాళ్లే అధికారంలోకి ఉన్నరు. దమ్ముంటే నా అక్రమ సంపాదనను బయటపెట్టాలి. మొన్నటికి మొన్న జడ్పీటీసీలను కొని చైర్మన్ పదవి నుంచి తప్పించే ప్రయత్నం చేసిన్రు. ఇప్పుడు మంథని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న నా సతీమణి పుట్ట శైలజపై అవిశ్వాసం పెట్టేందుకు కుట్రలకు తెరలేపిన్రు. నా గన్‌మెన్లను తొలగించి చంపాలని చూస్తున్నరు. కార్యకర్తలు కష్టపడి పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలి.

- పుట్ట మధూకర్, పెద్దపల్లి జడ్పీ చైర్మన్

